
సాక్షి తూర్పుగోదావరి

శుక్రవారం । 5 । మే । 2023



అచ్చమైన స్వచ్ఛంద సేవకులు

వృద్ధాప్య, వితంతు, దివ్యాంగ పింఛన్లను ఠంచనుగా అందిస్తూ వారి సంక్షేమాన్ని కాంక్షిస్తున్న ప్రభుత్వ లక్ష్యాన్ని నూరుశాతం నెరవేర్చడానికి గ్రామ/ వార్డు వలంటీర్లు కృషి చేస్తున్నారు. - IIలో▸



వనములలో విహరించే సత్యదేవుడు

సత్యదేవుని దివ్యకల్యాణ మహోత్సవాలలో భాగంగా ఐదో రోజు నవదంపతులు సత్యదేవుడు, అమ్మవార్లకు వన విహారోత్సవం ఘనంగా నిర్వహించారు. - IIలో▸

సెంట్రల్ జైలు సూపరింటెండెంట్‌గా రాహుల్



కంబాలచెరువు (రాజమహేంద్రవరం): విశాఖ సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ రాహుల్ గురువారం రాజమహేంద్రవరానికి బదిలీ అయ్యారు. ఇప్పటివరకు సూపరింటెండెంట్‌గా పనిచేసిన రాజారావు నెల్లూరులోని జైలు శిక్షణాలయానికి వెళ్లనున్నారు.

న్యూస్‌రీల్

నేడు 522 మందికి కల్యాణమస్తు లబ్ధి



మాధవీలత, కలెక్టర్

రాజమహేంద్రవరం సిటీ: వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీతోఫా ద్వారా జిల్లాలో 522 మందికి రూ.3.81 కోట్ల లబ్ధి చేకూరుతుందని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకాల ద్వారా పేద కుటుంబాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దివ్యాంగులు, భవన నిర్మాణ కార్మికుల ఆడపిల్లలకు వివాహ సమయంలో ఆర్థిక చేయూత అందజేస్తారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం ఆయా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు ఆర్థిక సహాయాన్ని జమ చేస్తారన్నారు. డీఆర్‌డీఏ పథక సంచాలకులు ఎస్.సుభాషిణి జిల్లాలో లబ్ధిదారుల వివరాలు ప్రకటించారు. కులాంతర వివాహం చేసుకున్న 77 మందికి ఈ ప్రయోజనం చేకూరుతుందన్నారు. వీరిలో బీసీలు 33, భవన నిర్మాణ కార్మికులు 6, దివ్యాంగులు 11, మైనార్టీలు 13, ఎస్సీ 13, ఎస్టీ ఒకరు ఉన్నారన్నారు. వెనుకబడిన కులాలకు చెందిన 278 మందికి, ఎస్సీలు 178 మందికి, ఎస్టీలు ఇద్దరికి ఈ మేరకు ఆర్థిక ప్రయోజనం కలుగుతుందన్నారు.

త్వరలో టెండర్ల ప్రక్రియ



పురుషోత్తపట్నం వద్ద గోదావరిని పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బాలశంకరరావు

సీతానగరం: నియోజకవర్గంలో ప్రజలకు గోదావరి జలాలను అందించేందుకు రూ. 215 కోట్లు మంజూరయ్యాయని, దానికి సంబంధించిన టెండర్ల ప్రక్రియను త్వరలో పూర్తి చేస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బాలశంకరరావు అన్నారు. పురుషోత్తపట్నంలో సత్యసాయి ఇంటేక్ వెల్ వద్ద గోదావరి ప్రాంతాలను ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ రవికుమార్, సీతానగరం, కోరుకొండ మండల ఏఈలు అవినాష్, సతీష్‌తో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఆదేశాల మేరకు సీతానగరం, కోరుకొండ, రాజానగరం మండలాలకు గోదావరి జలాలను అందించడానికి చేపట్టే ప్రాజెక్టు పనులను పరిశీలించామన్నారు.

బిక్కవోలులో భారీవర్షం

కొవ్వూరు: జిల్లా వ్యాప్తంగా కొన్ని చోట్ల గురువారం కూడా వర్షం కురిసింది. గడిచిన ఇరవై నాలుగు గంటల వ్యవధిలో గురువారం ఉదయం ఎనిమిది గంటల సమయానికి సరాసరి 29.5 మి.మీటర్లు వర్షపాతం నమోదైంది. బిక్కవోలులో గరిష్టంగా రికార్డు స్థాయిలో 70.8 మి.మీటర్లు వర్షం కురిసింది.రంగంపేటలో 53.8, రాజమహేంద్రవరం రూరల్‌లో 49.2,రాజానగరంలో 45.6,రాజమహేంద్రవరం అర్బన్ లో 36.6,కోరుకొండలో 36.4, కడియంలో 24.8,అనపర్తిలో 29.2,గోకవరంలో 13.6, సీతానగరంలో 9.8, తాళ్లపూడిలో 23.4, గోపాలపురంలో 9.2, నల్లజర్లలో 32.6, దేవరపల్లిలో 30.6, కొవ్వూరులో 25.6, చాగల్లులో 11.4, నిడదవోలులో 21.8, ఉండ్రాజవరంలో 25.2, పెరవలిలో 11.4 మి.మీటర్లు చొప్పున వర్షం కురిసింది.



ఉప్పలగుప్తం మండలం వాడపర్రులో మిల్లులకు ఎగుమతి అవుతున్న రైతుల వద్ద కొనుగోలు చేసిన ధాన్యం



అన్నదాతలకు ఉపాధి కూలీల దన్ను

మా బాబే.. వరి శీలిస్తారట!



- నేడు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో చంద్రబాబు పర్యటన
- టీడీపీ పాలనలో రైతులకు అరకొర పరిహారం
- నీలం తుపాను సాయం రూ.ఐదు కోట్లు ఎగవేత
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పంట నష్టపోయిన సీజన్‌లోనే పరిహారం
- ఉపాధి కూలీలతో అన్నదాతలకు సాయం

సాక్షి అమలాపురం: 'వ్యవసాయం దండగ' అన్న మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన వరిచేలను పరిశీలించేందుకు వస్తున్నారు. తాను ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పంట నష్టపోయిన రైతులకు ఒక పద్ధతి అంటూ లేకుండా విపరీతమైన జాప్యం చేసి పెట్టుబడి రాయితీ (ఇన్‌పుట్ సబ్సిడీ) ఇచ్చిన చంద్రబాబు రైతులను తక్షణం ఆదుకోవాలంటూ ఇప్పుడు ప్రతిపక్ష హోదాలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తుండడం గమనార్హం. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటచేలను చంద్రబాబు శుక్రవారం పరిశీలించనున్నారు. నష్టపరిహారం సకాలంలో ఇవ్వకుండా తన పాలనలో రైతులను పరిహాసమాడిన బాబు నేడు తగుదునమ్మా అంటూ పరిశీలనకు రావడంపై అన్నదాతలు ముక్కున వేలేసుకుంటున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం వేగాయమ్మపేట, తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని కడియంలో ఆయన వరిచేలను పరిశీలించనున్నారు. విభజన తరువాత చంద్రబాబు అధికారంలో ఉన్న ఐదేళ్లలో పంట నష్టపోయిన రైతులకు సకాలంలో పరిహారం ఇచ్చిన దాఖలాలు లేవు. ఇచ్చిన అరకొర పరిహారం కూడా సాంకేతిక కారణాలు, ఇతర సాకులు చూపి కోత పెట్టేవారు. ఆయన ఐదేళ్ల పాలనలో కేవలం 15,169 మంది రైతులకు చెందిన 16,635 ఎకరాలకు గాను రూ.9.38 కోట్లను పరిహారంగా అందించారు. ఉమ్మడి రాష్ట్రం విభజన సమయంలో సాంకేతిక కారణాలతో ఆగిపోయిన నీలం పరిహారం రూ.ఐదు కోట్లను మాత్రం జిల్లా రైతులకు ఇవ్వలేదు.

రెండు నెలల్లో వరద పరిహారం

గత ఏడాది జూలై నుంచి సెప్టెంబరు నెల వరకు గోదావరికి వరుసగా మూడుసార్లు వరద వచ్చింది. అదే ఏడాది నవంబరు నెలలో ఉద్యాన పంటలకు సంబంధించి 14 మండలాల్లో 4,963 హెక్టార్లలో సుమారు 14,885 మంది రైతులకు రూ.10,79,23,353 పెట్టుబడి రాయితీగా అందించారు. 437 మంది రైతులకు చెందిన 191.53 హెక్టార్లలో వరి పంట దెబ్బతినగా వారికి రూ.28.72 లక్షలు అందించారు.

ఈ విధానం చాలా బాగుంది



గత ఏడాది జూలై నుంచి సెప్టెంబరు వరకు గోదావరికి వరుసగా వరదలు వచ్చాయి. 4.90 ఎకరాల్లో అరటి దెబ్బతింది. నాకు రూ.30 వేల పరిహారం వచ్చింది. దీనివల్ల మొత్తం నష్టం తీరకున్నా పంట పోయిన రెండు నెలలకు పరిహారం ఇవ్వడం వల్ల రైతులందరం త్వరగా కోలుకున్నాం.

– బందారు శ్రీనివాసరావు, ఉద్యాన రైతు, వానపల్లి, కొత్తపేట మండలం.

పంటకాలంలోనే పరిహారం



ఖరీఫ్‌లో పంట నష్టపోతే ఖరీఫ్ పూర్తయ్యే నాటికి ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్ కూడా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందిస్తోంది. సమయానికి ఆదుకునే పరిస్థితి టీడీపీ ప్రభుత్వ హయాంలో లేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఆగమేఘాలపై ధాన్యం స్వయంగా కొనుగోలు చేస్తోంది.

– జిన్నూరి రామారావు (బాబి), ఏపీ స్టేట్ అగ్రికల్చర్ మిషన్ సభ్యుడు, డి.రావులపాలెం, అల్లవరం మండలం

టీడీపీ ప్రభుత్వ హయాంలో (2014 నుంచి 19 వరకు)

సంభవించిన సంవత్సరం	ప్రకృతి వైపరీత్యం	పరిహారం అందిన నెల
2014 అక్టోబరు	హుదూద్ తుపాన్	2104 డిసెంబరు (రెండు నెలలు)
2016 సెప్టెంబరు	భారీ వర్షాలు	2017 ఆగస్టు (11 నెలలు)
2017 సెప్టెంబరు	భారీ వర్షాలు	2018 సెప్టెంబరు (12 నెలలు)
2018 మార్చి- ఏప్రిల్	అకాల వర్షాలు	2018 ఆగస్టు (నాలుగు నెలలు)
2018 ఆగస్టు	భారీ వర్షాలు, వరదలు	2019 జనవరి (ఐదు నెలలు)

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత (2019 నుంచి)

సంభవించిన సంవత్సరం	ప్రకృతి వైపరీత్యం	పరిహారం అందిన నెల
2020 సెప్టెంబరు	వరదలు, భారీ వర్షాలు	27-10-2020 (నెల రోజులు)
2020 అక్టోబరు	వరదలు, భారీ వర్షాలు	17-11-2020 (నెల రోజులు)
2022 జూలై నుంచి సెప్టెంబరు	భారీ వరదలు, వర్షాలు	28-11-20202 (రెండు నెలలు)

రైతులను ఆదుకునేందుకు.. ఉపాధి దన్ను

భారీ వర్షాల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్ కోనసీమ జిల్లా యంత్రాంగం వేగంగా స్పందించింది. రైతులకు చేదోడుగా మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో నీట మునిగిన పనులు ఒబ్బిడి చేయడం, ధాన్యం రాశులు, చేలల్లో ఉన్న నీరు దిగేలా బోదెలు వేయించడం చేసింది. గత మూడు రోజుల్లో జిల్లా వ్యాప్తంగా 1,03,000 మంది ఉపాధి కూలీలు ఈ పనుల్లో పాల్గొన్నారు. మరోవైపు తడిసిన, రాశుల వద్ద నిల్వ ఉంచిన ధాన్యాన్ని ఆగమేఘాలపై కొనుగోలు చేస్తున్నారు. ఈ నెల ఒకటో తేదీ వరకు 33,192.760 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా, రెండో తేదీన 2,354.84 ఎం.టీలు, మూడో తేదీన 1,573.6 ఎం.టీలు, నాలుగో తేదీన 1,931.2 ఎం.టీల ధాన్యాన్ని రైతుల వద్ద నుంచి సేకరించారు.

నాగేశ్వరరావు కుటుంబానికి బాసట

- మానవత్వంతో రూ.15 లక్షల చెక్కు అందజేసిన ఎంపీ భరత్‌రామ్
- అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ



నాగేశ్వరరావు కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరంలో ఇటీవల దురదృష్టవశాత్తూ కాలువలో పడి మృతి చెందిన నాగేశ్వరరావు కుటుంబాన్ని ఆదుకుంటామని ఎంపీ మార్గాని భరత్ రామ్ చెప్పారు. తిలక్ రోడ్డు షిరిడీ సాయి మార్గ్ జంక్షన్‌లో నిర్మాణ దశలో ఉన్న డ్రెయినేజీలో వారం రోజుల కిందట ఏరుకొండ నాగేశ్వరరావు కాలు జారి పడి మృతి చెందిన విషయం తెలిసిందే. మృతుడి కుటుంబానికి సహాయంగా నగర వైఎస్సార్ సీపీ తరఫున రూ.10 లక్షలు, డ్రెయినేజీ కాంట్రాక్టర్ తరఫున రూ.5 లక్షలు మొత్తం రూ.15 లక్షలు పరిహారాన్ని ఎంపీ భరత్ గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఇటువంటి సహాయాన్ని బహిర్గతం చేయకూడదన్నారు. కానీ కొందరు టీడీపీ నాయకులు శవ రాజకీయాలు చేయడం వల్ల చెప్పక తప్పడం లేదన్నారు. బాధితులను మానవతా దృక్పథంతో ఆదుకోవాలి గానీ స్వప్రయోజనాలకు వాడుకోవడం మంచిది కాదని హితవు పలికారు. మృతుడి ఇంట్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించే విధంగా చర్యలు తీసుకుంటామని ఎంపీ భరత్‌రామ్ హామీ ఇచ్చారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నగర పార్టీ అధ్యక్షుడు అడపా శ్రీహరి, బొమ్మన జయ్ కుమార్ తదితరులు ఉన్నారు.

చకచకా ధాన్యం కొనుగోళ్లు

- ఆఫ్‌లైన్‌లోనూ కొనుగోలుకు చర్యలు
- నిర్లక్ష్యంగా ఉన్న ఐదుగురు మిల్లర్లపై చర్యలు
- ఉపాధి హామీ పథకం కింద లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు తొలగింపు

కొవ్వూరు: వర్షంతో రైతులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం సత్వరమే స్పందించింది. ప్రభుత్వాదేశాల మేరకు అధికారులు ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లోనూ ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. ఇటీవల వర్షాలకు తడిసిన ధాన్యం తప్పనిసరిగా కొనుగోలు చేయాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. షెడ్యూలు ప్రకారం కూపన్లు జారీ చేస్తూ మూడు రోజుల నుంచి ఆఫ్‌లైన్‌లో కొనుగోలు చేస్తున్నారు. అత్యధికంగా 40 శాతంపైగా విస్తీర్ణంలో పండే ఎంటీయూ–1121 రకం కొంటున్నారు. 28,554 హెక్టార్లలో ఈ రకం పంట కోతలు పూర్తి చేశారు. 2,59,192 మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చినట్లు అంచనా. ఆన్‌లైన్‌లో సరాసరి రోజుకు 4వేల నుంచి 5 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేస్తున్నారు. ఆఫ్‌లైన్‌లో ఒక్క బుధవారమే 9,429.23 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారు. గురువారం సాయంత్రానికి జిల్లా వ్యాప్తంగా 1,35,018.833 మెట్రిక్ టన్నుల కొనుగోలుకు కూపన్లు జారీ చేశారు. దీనిలో 1,05,374.080 మెట్రిక్ టన్నులు ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఆఫ్‌లైన్ ద్వారా మరో 12,209.250 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారు. ఇప్పటి వరకు 1,07,877.146 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించింది.

రానున్న తుపానుపై దిగులు

తుపాన్ (మోచా) ఏర్పడే అవకాశముందనే వాతావరణ హెచ్చరికలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కొద్దిరోజులుగా వెంటాడుతున్న వానలతో ఇబ్బంది పడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 71 శాతం ఆయకట్టులో వరికోతలు పూర్తయ్యాయి. ధాన్యం ఇంకా కళ్లాల్లోనే ఉంది. సకాలంలో ఒడ్డుకు చేర్చకపోతే నష్టపోయే పరిస్థితులున్నాయి. వరి,అరటి పంటలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. 420 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. పంటపొలాల్లో నిలిచిపోయిన వర్షపు నీరు బయటి వెళ్లేందుకు ఉపాధి హామీ పథకం కింద బోదెలు చేసేందుకు కలెక్టర్ అనుమతించారు. చాగల్లు,కొవ్వూరు,కడియం తదితర మండలాల్లో ఈ పనులు చేపట్టారు. మరోపక్క ధాన్యం కొనుగోలులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఐదుగురు మిల్లర్లపై అధికారులు చర్యలకు సిద్ధమయ్యారు. మరో 55 మందికి నోటీసులిచ్చారు.

ఇబ్బంది కలగకుండా చర్యలు

ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటున్నాం. క్షేత్రస్థాయిలో ఇబ్బందులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ పరిష్కరిస్తున్నాం. లోతట్టు ప్రాంతాల్లో నీరు బయటకు పంపేందుకు పనులు చేయించాలని డ్వామా పీడీని ఆదేశించాం. ఉపాధి హామీ కింద కూలీలను ఉపయోగించుకుని నీరు బయటికి పంపించే చర్యలు తీసుకోవాలని చెప్పాం.

– ఎస్.తేజ్ భరత్, జాయింట్ కలెక్టర్

కోతలు తాత్కాలికంగా ఆపాలి

తుపాను హెచ్చరికలు, వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో కోతలు తాత్కాలికంగా నిలిపివేయాలి. తడిసిన ధాన్యం ఉంటే ఐదుశాతం ఉప్పు ద్రావణం పిచికారీ చేస్తే మొలక రాకుండా ఉంటుంది. ధాన్యం తడవకుండా బరకాలు కప్పుకోవాలి. సురక్షితమైన ప్రాంతాల్లో భద్రపరుచుకోవాలి.

–ఎస్.మాధవరావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి



కొవ్వూరు మండలం నందమూరు శివారులో ధాన్యాన్ని బస్తాల్లో నింపుతున్న కూలీలు

పుంజుకుంటున్న ధాన్యం సేకరణ (మెట్రిక్ టన్నుల్లో)

తేదీ	ఆన్‌లైన్‌లో కొనుగోలు	ఆఫ్‌లైన్‌లో కొనుగోలు	మొత్తం
ఏప్రిల్ 30	4,719.320	–	4,719.320
ఈనెల 1	6,278.720	–	6,278.720
ఈనెల 2	3,903.760	1,355.42	5,259.18
ఈనెల 3	4,972,500	9,429.23	14,401.73
ఈనెల 4	2,294.640	1424.600	3,719.241

ఐదు రోజులుగా సరాసరి వర్షపాతం(మి.మీ.)

తేదీ	జిల్లా సరాసరి	రాజమహేంద్రవరం	కొవ్వూరు
ఏప్రిల్–30	11.3	6.2	16.9
ఈనెల 1	35.5	33.6	37.6
ఈనెల 2	14.9	18.7	10.8
ఈనెల 3	17.5	18.2	16.7



ఈజీగా.. ఈకేవైసీ..

- అకౌంట్ల భద్రతకు ఈకేవైసీ తప్పనిసరి
- పెన్షనర్ల కోసం ప్రత్యేక శిబిరాల నిర్వహణ
- సబ్, డివిజన్ ట్రెజరీల్లోనూ నమోదుకు అవకాశం

కొవ్వూరు: ఉద్యోగి, పెన్షనర్లు కాంప్రహెన్సీవ్ ఫైనానియల్ మేనేజ్‌మెంటు సిస్టం (సీఎఫ్ఎంఎస్) పేరోల్ హెర్బ్ ద్వారా మరింత సరళతరంగా సేవలు పొందేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వు ప్రకారం సీఎఫ్ఎంఎస్ ఐడీని ఆధార్ నెంబర్‌ను అనుసంధానం చేసిన మొబైల్‌తో తప్పనిసరిగా ఈకేవైసీ చేయించాల్సి ఉంటుంది. జనవరి 11న జీవో జారీ అయినా కొందరు పెన్షన్‌దారులు ఈప్రక్రియ పూర్తి చేయలేదు. జిల్లా వ్యాప్తంగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, వలంటీర్లు, కాంట్రాక్టు,అవుట్ సోర్సింగ్ ,ఇతర ఉద్యోగులు కలిపి 49,208 మంది ఉన్నారు. 95 శాతానికి పైగా తమ సీఎఫ్ఎంఎస్ ఐడీలను ఈకేవైసీ చేశారు. వీరికి డ్రాయింగ్ ఆఫీసర్స్ ఉంటారు. వారి ద్వారా ఈకేవైసీ పూర్తి చేయిస్తున్నారు. వయోభారం, లేవలేని స్థితి తదితర కారణాలతో 13,476 మంది పెన్షనర్లకు గాను 7,831 మంది మాత్రమే ఈకేవైసీ పూర్తి చేశారు. వీరి ఇబ్బందులను దృష్టి ఉంచుకుని ఖజానా శాఖ జిల్లాలో 8 చోట్ల ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తోంది. ఈనెల 10లోగా ఈకేవైసీ ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

ప్రత్యేక శిబిరాలు

కొవ్వూరు డివిజనల్ ట్రెజరీ పరిధిలోని వారికి 3,4 తేదీల్లో తాళ్లపూడి మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక శిబిరాలు నిర్వహించారు. 4,5 తేదీల్లో చాగల్లు ఎంపీడీవో కార్యాలయంలో.. 5,6 తేదీల్లో దేవరపల్లి ఎంపీడీవో కార్యాలయంలో, 10 వరకూ కొవ్వూరు పెన్షనర్లకు కొవ్వూరు డీఎస్‌టీవో ఆఫీసులో..4,5 తేదీల్లో బిక్కవోలులో ఎంపీడీవో కార్యాలయంలో..4న గోకవరం, 5న సీతానగరం ఎంపీడీవో కార్యాలయంలో..4,5,6 తేదీల్లో ధవళేశ్వరం,రాజానగరం పెన్షనర్ల భవనంలోను ఈకేవైసీ చేస్తున్నారు.

జిల్లాలో ఉద్యోగుల వివరాలు

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు	: 19,587
పెన్షనర్లు	: 13,476
వలంటీర్లు	: 9,352
కాంట్రాక్టు ఉద్యోగులు	: 652
అవుట్ సోర్సింగ్	: 2,038
ఇతర ఉద్యోగులు	: 3,826



తాళ్లపూడి ఎంపీడీవో కార్యాలయంలో విశ్రాంత ఉద్యోగులకు ఈకేవైసీ చేస్తున్న ట్రెజరీ ఉద్యోగులు

జిల్లాలో పెన్షనర్ల ఈకేవైసీ నమోదు వివరాలు

సబ్ ట్రెజరీ	పెన్షనర్ల సంఖ్య	ఈకేవైసీ పూర్తి	పెండింగ్
రాజమహేంద్రవరం	9,460	3,688	5,772
కోరుకొండ	828	450	378
అనపర్తి	500	252	248
కొవ్వూరు	1,502	690	812
నిడదవోలు	1,186	565	621
మొత్తం	13,476	5,645	7,831

పదో తేదీలోపు ఈకేవైసీ



పెన్షన్‌దారులంతా ఈనెల పదో తేదీలోపు కచ్చితంగా ఈకేవైసీ చేయించుకోవాలి. ప్రత్యేక శిబిరాలను సద్వినియోగ పరుచుకోవాలి. సబ్ ట్రెజరీ,డివిజనల్ ట్రెజరీల్లో కుడా ఈకేవైసీ చేయాలని ఆదేశించాం.పెన్షన్‌దారులకు తమ సిబ్బంది ఫోన్ సమాచారం ఇస్తున్నారు. ఈకేవైసీ ద్వారా వ్యక్తిగత ఖాతాలకు భద్రత ఉంటుంది.

– ఎన్.సత్యనారాయణ, జిల్లా ఖజానా,లెక్కల శాఖ అధికారి

శిబిరాల నిర్వహణ అభినందనీయం



పెన్షనర్లకు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయం. వయోభారంతో చాలామంది బయటకు రాలేని పరిస్థితి ఉంది. పెన్షనర్స్ అసోసియేషన్ ద్వారా పెన్షన్‌దారులకు అవగాహన కల్పిస్తున్నారు.

– పెనుమాక జయరాజు బాబు జగ్జీవన్‌రామ్ రిటైర్డు ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు, కొవ్వూరు

యంత్రసేవా పథకంతో రైతులకు భరోసా

రాజమహేంద్రవరం సిటీ: వైఎస్సార్ యంత్రసేవా పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కృషి చేస్తోందని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత అన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి వెలగపూడి కార్యాలయం నుంచి గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈ పథకం ద్వారా 162 (కస్టమ్ హైరింగ్ సెంటర్లు) సీహెచ్‌సీల్లో 136 రైతు సంఘాలకు ఆమోద పత్రాలు అందజేశామని, వాటిలో 118 సంఘాలకు బ్యాంకు రుణాలు మంజూరు చేశామన్నారు. డ్రోన్ పైలట్ ప్రాజెక్టుపై 5 గ్రూపులకు శిక్షణ ఇచ్చామన్నారు. జిల్లాలో 3,56,583 ఇళ్లకు గాను 2,88,254 ఇళ్లకు తాగునీటి కుళాయి కనెక్షన్లు ఏర్పాటు చేశామన్నారు. జలజీవన్ మిషన్ కింద మిగిలిన 67,329 ఇళ్లకు నెలవారీ లక్ష్యాలను నిర్దేశించినట్టు తెలిపారు. జగనన్న భూహక్కు భూరక్షా పత్రాల పంపిణీలో భాగంగా జిల్లాకు సంబంధించిన 29,895 పత్రాలలో ఇప్పటి వరకు 28,188 పంపిణీ చేశామన్నారు. జిల్లాలోని 44 గ్రామాల్లో స్టోన్ ప్లాంటేషన్ చేపట్టాల్సి ఉండగా, 33 గ్రామాల్లో పూర్తి చేశామని, ఆరుచోట్ల పురోగతిలో ఉండగా, ఐదు గ్రామాలకు మెటీరియల్ అందాల్సి ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో సమీకృత వ్యవసాయ పద్ధతుల ద్వారా 800 హెక్టార్లు, రాష్ట్రీయ కృషి యోజన పథకం అమల్లో భాగంగా 300 హెక్టార్లలో ఎడిబుల్ ఆయిల్ ఉత్పత్తి, 3,500 హెక్టార్లలో డ్రిప్ ఇరిగేషన్ సాగు చేపట్టామన్నారు. మినీ ఫిష్ మార్కెటింగ్ యూనిట్లకు సంబంధించి 200 లక్ష్యం కాగా, 139 సంఘాలను గుర్తించి 117 మంది లబ్ధిదారులకు మ్యాపింగ్ చేశామన్నారు. జగనన్న పాలవెల్లువ ద్వారా 5,522 మంది పాడి రైతులు పేర్లు నమోదు చేసుకోవడం జరిగిందన్నారు.

అచ్ఛమైన స్వచ్ఛంద సేవకులు

వృద్ధాప్య, వితంతు, దివ్యాంగ పింఛన్లను తంచనుగా అందిస్తూ వారి సంక్షేమాన్ని కాంక్షిస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వ లక్ష్యాన్ని నూరుశాతం నెరవేర్చడానికి గ్రామ/వార్డు వలంటీర్లు (స్వచ్ఛంద సేవకులు) కృషి చేస్తున్నారు. ఒకటో తేదీన వేకువ జామునే ఇంటి తలుపు తట్టి పింఛన్లు అందజేస్తున్న వలంటీర్లు లబ్ధిదారుల మోముల్లో ఆనందాన్ని నింపుతున్నారు. అంతటితో ఆగకుండా గ్రామాంతరంలో ఉన్న లబ్ధిదారుల వద్దకు వెళ్లి మరీ పింఛన్లు అందజేస్తూ వలంటీర్లు తమ పనికి సార్థకత చేకూరుస్తున్నారు. ఇతర జిల్లాల్లో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నవారు, కారణాంతరాలతో బంధువుల ఇళ్లలో ఉన్నవారి వద్దకు దూరాభారం లెక్క చేయకుండా వెళ్లి పింఛను సొమ్ము అందజేస్తూ పలువురి మన్ననలు పొందుతున్నారు.

జిల్లా సరిహద్దులు దాటి..



విశాఖలో చికిత్స పొందుతున్న తలుపులయ్యకు పింఛన్ ఇస్తున్న వలంటీరు కృపారాణి

తుని రూరల్: అనారోగ్యంతో బాధపడుతూ విశాఖపట్నంలో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తుని మండలం తాళ్లూరు గ్రామానికి చెందిన తమరాన తలుపులయ్యకు వృద్ధాప్య పింఛన్ పంపిణీ చేసి వలంటీరు తమరాన కృపారాణి తన సేవాతత్పరతను చాటుకుంటుంది. పింఛన్ల పంపిణీ గడువు ముగుస్తున్నప్పటికీ ఆస్పత్రి నుంచి స్వగ్రామానికి తలుపులయ్య రాకపోవడంతో వలంటీరు 120 కిలోమీటర్ల దూరం ప్రయాణించి లబ్ధిదారుడికి పింఛన్ మొత్తాన్ని అందజేసింది. సేవా భావంతో శ్రమకోర్చి దూరాభారాన్ని లెక్కచేయకుండా జిల్లా సరిహద్దులు దాటి వెళ్లి పింఛన్ అందజేసిన కృపారాణిని వైఎస్సార్ సీపీ నాయకులు అభినందించారు.

దూర ప్రాంతానికి వెళ్లి..



శ్రీరంగపట్నం వెళ్లి పింఛన్ అందజేస్తున్న వలంటీరు దేవి

కిర్లంపూడి: దూర ప్రాంతాలకు వెళ్లినా సకాలంలో లబ్ధిదారులకు పింఛన్ అందజేయడానికి వలంటీర్లు ఎంతగానో కృషి చేస్తున్నారు. కిర్లంపూడి సచివాలయం-4కు చెందిన పింఛన్ దారు అడారి రమాదేవికి కాలు విరగడంతో శ్రీరంగపట్నంలో తన సోదరి ఇంటి వద్ద చికిత్స పొందుతోంది. ఇది తెలుసుకున్న వలంటీరు బుద్ద దేవి గురువారం తన సొంత ఖర్చులతో అక్కడకు వెళ్లి పింఛన్ సొమ్మును అందజేసింది.

కిడ్నీ రోగులకు ప్రభుత్వం భరోసా..



కిడ్నీ సమస్యతో బాధపడుతున్న నాగేశ్వరరావుకు రూ.పదివేలు పింఛను అందజేస్తున్న వైస్ ఎంపీపీ సత్యనాగేశ్వరరావు, నాయకులు

తుని రూరల్: కిడ్నీ సమస్యలతో బాధపడేవారికి ప్రభుత్వం భరోసా కల్పిస్తుందని వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్య నాగేశ్వరరావు అన్నారు. తుని మండలం ఎస్.అన్నవరం ఎస్సీ కాలనీలో కిడ్నీ సమస్యతో బాధపడుతున్న గుల్ల నాగేశ్వరరావుకు మంజూరైన రూ.పదివేల పింఛన్‌ను గురువారం ఆయన అందజేశారు. రోడ్లు భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా చొరవతో ఉన్నత అధికారులు రూ.పదివేలు పింఛన్ మంజూరు చేశారన్నారు. మంజూరైన పింఛన్ మొత్తాన్ని ఈ నెల నుంచి విధిగా వలంటీర్ అందిస్తారన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు గారా శ్రీనివాసరావు, కుసనం దొరబాబు, వంగలపూడి జమీలు, వంగలపూడి అప్పారావు, కార్యదర్శి మధుశేఖర్ పాల్గొన్నారు.

వనములలో విహరించే సత్యదేవుడు

ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చిన సత్యదేవుడు, అమ్మవారు





సత్యదేవుడు, అమ్మవార్ల వన విహారోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్న పండితులు, ప్రత్యేక అలంకరణలో సత్యదేవుడు, అమ్మవారు

అన్నవరం: రత్నగిరిపై నిర్వహిస్తున్న సత్యదేవుని దివ్యకల్యాణ మహోత్సవాలలో భాగంగా ఐదో రోజు గురువారం సాయంత్రం నవ దంపతులు సత్యదేవుడు, అమ్మవార్లకు కొండదిగువన ఉద్యానవనంలో వన విహారోత్సవం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం 3–30 గంటలకు పెళ్లి పెద్దలు సీతారాములు వెంట రాగా నవ దంపతులు సత్యదేవుడు, అమ్మవార్లను రత్నగిరి నుంచి ఊరేగింపుగా కొండదిగువన ఉద్యానవనంలోని మంటపం వద్దకు తీసుకువచ్చి అక్కడ వేదికపై ప్రతిష్ఠించి పండితులు పూజలు చేశారు. తొలుత విఘ్నేశ్వరపూజ అనంతరం పుణ్యాహవచనం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు నూతన పట్టువస్త్రాలను దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ అజాద్, అసిస్టెంట్ కమిషనర్ రమేష్ బాబు సమర్పించారు. పూజలనంతరం వేద పండితులు ఆశీస్సులు అందజేశారు. కార్యక్రమాన్ని వేదపండితులు గొల్లపల్లి ఘనాపాఠీ, చిట్టి శివ, యనమండ్ర శర్మ,ఉపాధ్యాయుల రమేష్, ప్రధానార్చకులు ఇంద్రగంటి నర్సింహమూర్తి, కోట శ్రీనివాస్, వ్రత పురోహిత సంఘం అధ్యక్షుడు రవిశర్మ, వ్రత పురోహితులు పాలంకి పట్టాభి, అంగర సతీష్, అర్చకులు సుధీర్, పవన్ నిర్వహించారు.

ప్రత్యేక అలంకరణలో దర్శనం

స్వామివారి వనవిహారోత్సవంలో సత్యదేవుడు, అమ్మవార్లను సర్వాంగ సుందరంగా అలంకరించారు. స్వామి, అమ్మవార్లను తిలకించిన భక్తులు తన్మయత్వంతో పరవశించారు. ఏఈఓ తిరుమలేశ్వరరావు, సూపరింటెండెంట్లు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నేడు శ్రీచక్రస్నానం...నాకబలి, దండియాడింపు

సత్యదేవుని దివ్యకల్యాణ మహోత్సవాలలో ఆరో రోజు శుక్రవారం వైశాఖ పౌర్ణిమ సందర్భంగా ఉదయం ఎనిమిది గంటలకు కొండదిగువన పంపా నది వద్ద సత్యదేవుని శ్రీచక్రస్నానం నిర్వహిస్తారు. సాయంత్రం నాలుగు గంటలకు అనివేటి మంటపంలో నాకబలి, దండియాడింపు కార్యక్రమాలు నిర్వహిస్తారని అధికారులు తెలిపారు. వైశాఖ పౌర్ణిమ సందర్భంగా వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం, శుక్రవారం సందర్భంగా చండీహోమం ఘనంగా నిర్వహిస్తారు.

సత్యదేవుని హుండీ రాబడి రూ.1.75 కోట్లు



సత్యదేవుని హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

అన్నవరం: శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానానికి హుండీల ద్వారా 37 రోజులకు రికార్డు స్థాయిలో రూ.1,74,78,040 ఆదాయం సమకూరింది. దేవస్థానంలో హుండీలను గురువారం తెరచి భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించినట్లు ఈఓ చంద్రశేఖర్ అజాద్ తెలిపారు. దీంతోబాటు బంగారం 280 గ్రాములు, కిలో వెండి వచ్చినట్లు వివరించారు. నగదు 1,68,41,130, చిల్లర నాణేలు 6,36,910 లభించినట్లు తెలిపారు. దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ధర్మకర్తల మండలి సభ్యులు పేరూరి బద్రీ నారాయణ, ఏసీ రమేష్‌బాబు, జిల్లా దేవదాయశాఖ అధికారి పి.నారాయణమూర్తి, ఎంఎం వీరభద్రరావు, సీహెచ్ ఉదయ్‌బాబునాయుడు, దేవస్థానం సిబ్బంది, పురోహితులు, నాయీ బ్రాహ్మణులు, స్వచ్ఛంద సేవల సిబ్బంది హుండీ లెక్కింపులో పాల్గొన్నారు.

సీఎం కప్‌లో తూర్పు క్రీడాకారుల ప్రతిభ

పలు విభాగాల్లో పతకాలు కైవసం

నాగమల్లితోట జంక్షన్: తిరుపతిలో మూడు నుంచి ఐదో తేదీ వరకు జరుగుతున్న ఏపీ సీఎం కప్ రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా క్రీడాకారులు పలు విభాగాల్లో ప్రతిభను కనపరిచి పతకాలు సాధించారు. వెయిట్ లిఫ్టింగ్‌లో ఉమామహేశ్వర్, ధాత్రి, సుబ్రహ్మణ్యం స్వర్ణ పతకాలు, సాత్విక, కె.శ్రీను రజత, మధుచందన, ఇందిర ప్రియాంక, ఆదిత్య, దుర్గారావు కాంస్య పతకాలు అందుకున్నారు. బాక్సింగ్‌లో కె.రాణి రజత, ఎస్‌కే నజీర స్వర్ణ పతకాలు, టెన్నిస్‌లో వీనస్ గ్లోరి ఓపెన్ కేటగిరిలో రజత పతకం సాధించారు. హాకీలో తూర్పు జట్టు క్వార్టర్ ఫైనల్స్‌కు, బాస్కెట్‌బాల్‌లో పురుషుల జట్టు ఫైనల్స్‌కు చేరుకున్నాయని డీఎస్‌ఏ చీఫ్ కోచ్ శ్రీనివాస్ కుమార్ గురువారం తెలిపారు.

నేడు సాఫ్ట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక

కాజులూరు: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల స్థాయిలో శుక్రవారం నిర్వహించే జూనియర్ బాలుర, బాలికల సాఫ్ట్‌బాల్ సెలెక్షన్స్‌కు క్రీడాకారులు హాజరుకావాలని జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జె.హరికృష్ణ, ఏఎస్ రాంప్రసాద్ తెలిపారు. ఈ నెల 26 నుంచి 28 వ తేదీ వరకూ కడప జిల్లా రాయచోటిలో జరగనున్న 10వ జూనియర్ అంతర్ జిల్లాల సాఫ్ట్‌బాల్ చాంపియన్ షిప్ పోటీలకు జిల్లా జట్టును ఎంపిక చేసేందుకు గత మంగళవారం గొల్లపాలెం ఆర్‌డబ్ల్యూఎస్ వాటర్‌ట్యాంక్ వెనుక ఉన్న క్రీడామైదానంలో అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఒకటో తేదీ నుంచి జిల్లాలో భారీ వర్షాలు కురవటంతో దూర ప్రాంతాల నుంచి వచ్చే క్రీడాకారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కార్యక్రమాన్ని వాయిదా వేశారు. రాష్ట్ర స్థాయి పోటీలు దగ్గర పడుతుండటంతో ఎంపికైన క్రీడాకారులు ప్రాక్టీస్‌కి సమయం తక్కువవుతుందనే ఉద్దేశంతో సెలెక్షన్ ఏర్పాట్లు చేస్తున్నామని వారు తెలిపారు. ఉదయం పది గంటల నుంచి సెలెక్షన్ ప్రారంభమవుతుందని క్రీడాకారులు గంట ముందే క్రీడా మైదానంలో ఉండాలన్నారు. మరిన్ని వివరాల కోసం 99493 94568, 83099 65048 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చునన్నారు.

ఉప్పుటేరులోకి దూసుకెళ్లిన కారు



ఉప్పుటేరులోకి దూసుకెళ్లిన కారు



యువకులను రక్షించిన క్రాంతిని సత్కరిస్తున్న సీఐ శ్రీనివాస్, ఎస్సై రామలింగేశ్వరరావు

కొత్తపల్లి: ఉప్పాడ–కోనపాపపేట బీచ్ రోడ్డులోని పొన్నాడ శివారు రామన్నపాలెం వంతెన సమీపంలోని ఉప్పుటేరులోకి గురువారం కారు దూసుకెళ్లింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కాకినాడకు చెందిన నలుగురు యువకులు కోనపాపపేట వెళుతుండగా ప్రమాదవశాత్తూ రామన్నపాలెం సమీపంలో ఉన్న ఉప్పుటేరులోకి కారు దూసుకెళ్లింది. బీచ్ రోడ్డులో వెళుతున్న కోనపాపపేటకు చెందిన పుక్కాల క్రాంతి, ఆటోడ్రైవర్ మడదా నాగేశ్వరరావు కారు అద్దాలను పగులకొట్టి ఆ యువకులను రక్షించారు. చికిత్స నిమిత్తం వారిని కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. దీనిపై ఎస్సై రామలింగేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులకు సమాచారం ఇచ్చి యువకులను రక్షించిన క్రాంతిని సీఐ వైఆర్‌కె శ్రీనివాసరావు శాలువా, పూలమాలతో సత్కరించారు. ప్రమాదకరంగా ఉన్న రోడ్డుకు మరమ్మతులను నిర్వహించారు.

చేపల వేటకు వెళ్లి బాలుడి మృతి



పాలెపు జగన్ (ఫైల్)



పాలెపు జగన్ మృతదేహాన్ని ఒడ్డుకు చేరుస్తున్న మత్స్యకారులు

కాట్రేనికోన: మండలంలోని పల్లం గ్రామానికి చెందిన పాలెపు జగన్ 14 తండ్రితో పాటు గోదావరి పాయలో చేపల వేటకు వెళ్లగా కాళ్లకు వల చిక్కుకోవడంతో నీటిలో పడిమృతి చెందాడు. బాలుడి తండ్రి పాలెపు సత్యం వేటకు వెళుతుండగా జగన్ తోడుగా వెళ్లాడు. పల్లం వంతెన సమీపంలో గోదావరి పాయలో చేపల వేట చేస్తుండగా బాలుడి కాళ్లకు వల తగిలి నీటిలో మునిగిపోయాడు. బాలుడు నీటిలో మునిగిపోతున్న విషయాన్ని గమనించిన తండ్రి సత్యం కొడుకును రక్షించేందుకు ప్రయత్నం చేశాడు. అయితే గోదావరి పాయ లోతు ఎక్కువ గా ఉండటం, నీటి ప్రవాహం ఉండటంతో బాలుడు దిగువకు కొట్టుకుపోయాడు. బాలుడి తండ్రితో పాటు స్థానికులు వెతకడంతో బాలుడి మృతదేహం దొరికింది. బాలుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు దుఃఖసాగరంలో మునిగి పోయారు. పల్లం గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ప్రత్తిపాడు: మండలంలోని ఏలూరు గ్రామంలో జరిగిన ప్రమాదంలో గాయపడి, కాకినాడ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం జరిగింది. స్థానిక పోలీసుల కథనం మేరకు ఏలూరు గ్రామానికి చెందిన పేరిచర్ల సూరిబాబు (40) మార్చి 24వ తేదీన తన బైక్‌లో పెట్రోలు అయిపోయిందని, పెట్రోల్ బంక్ నుంచి సీసాలో తెచ్చుకున్న పెట్రోల్‌ను సిగరెట్టు కాలుస్తూ, అజాగ్రత్తగా తన బైక్‌లో పోసుకుంటుండగా అకస్మాత్తుగా మంటలు వ్యాపించాయి. దీంతో ముఖం నుంచి నడుము భాగంగా వరకు శరీరం కాలిపోయింది. తీవ్రంగా గాయపడిన పేరిచర్ల సూరిబాబును కాకినాడ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. ప్రత్తిపాడు ఎస్సై ఎం.పవన్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫ్యాషన్

టూర్ స్టైల్

వేసవిలో ఎండవేడిమి అనే భయం ఉంటుంది. కానీ, సెలవుల్లో టూర్లు.. ఊర్లు తిరగచ్చనే ఆనందమూ ఉంటుంది. టూర్లకు వెళ్లినప్పుడు అనుకూలమైన డ్రెస్సులను ఎంపిక చేసుకుంటే ఆ ఆనందం రెట్టింపు అవుతుంది. కలర్‌ఫుల్‌గా, కంఫర్టబుల్‌గా, స్టైలిష్‌గా, వెరైటీగా ఉండాలని కోరుకునేవారు సులభంగా ఇలాంటి డ్రెస్సులను ఎంపిక చేసుకోవచ్చు. లైట్‌వెయిట్ డ్రెస్సింగ్‌తో ఈ వెకేషన్ టూర్లను మరింతగా ఆస్వాదించవచ్చు.





సింగిల్ పీస్ డ్రెస్ ఎంపికలో లేయర్స్ ఉన్న ఫ్రాక్స్, స్కర్ట్స్‌కు ప్రాముఖ్యం ఇవ్వచ్చు. లేయర్స్ కాంట్రాస్ట్ కలర్స్‌లో ఉండటం వల్ల స్టైలిష్‌గానూ కనిపిస్తాయి. ఫొటోలకు కలర్‌ఫుల్‌గానూ ఉంటుంది.



టాప్ టు బాటమ్ ఒకే కలర్ లేదా కాంట్రాస్ట్‌లో ఉన్న పలాజో–టాప్స్ కంఫర్ట్‌కు, స్టైల్‌కు పర్‌ఫెక్ట్ ఎంపిక అవుతుంది.



కాటన్ లాంగ్ టాప్స్, ఫ్రాక్ స్టైల్ కుర్తీలు బెస్ట్ ఆప్షన్‌గా నిలుస్తాయి. వీటికి బాటమ్‌గా పలాజో లేదా ధోతీ ప్యాంట్స్‌ను ఎంపిక చేసుకోవచ్చు. లేదంటే ఫ్రాక్ మాదిరిగా ఈ టాప్స్‌ను ధరిస్తే చాలు.



మిడ్ స్కర్ట్స్‌లో ప్రింటెడ్స్ మన సును ఆహ్లాదంగా మార్చే స్తాయి. వీటికి స్లీవ్‌లెస్ లేదా షర్ట్ టైప్ టాప్స్ సౌకర్యాన్ని బట్టి ఏ వయసు వారైనా ఎంచుకోవచ్చు.

టూర్లు వెళ్లేవారు రెగ్యులర్ డ్రెస్సులు కాకుండా వెళ్లబోయే ప్రాంత వాతావరణాన్ని బట్టి ఎంపిక చేసుకుంటారు. ఇక అక్కడి జ్ఞాపకాలను ఫొటోలలో భద్ర పరుచుకుంటారు కాబట్టి అందమైన డ్రెస్సులు ఉండాలనుకుంటారు. అందుకే, లైట్‌వెయిట్, సింగిల్ పీస్ డ్రెస్‌లకు అధిక ప్రాముఖ్యత ఉంటుంది. టూర్లలో వెంట తీసుకెళ్లే డ్రెస్‌లలో ఇవి ఎంచుకుంటే చాలు, స్టైలిష్ లుక్‌తో మెరిసిపోతారు. వెళ్లినచోట కంఫర్ట్‌ని ఎంజాయ్ చేస్తారు.



టై అండ్ డై, స్ట్రైప్స్ డ్రెస్సులు టూర్స్‌కి మంచి లుక్‌నిస్తాయి. వీటిలో లైట్ కలర్స్ ఎంచుకోవడం మేలు. మ్యాక్సీ, స్కర్ట్స్ ఇలా ఎంచుకోవచ్చు.

బ్యూటిప్స్

మృదువైన చేతులు పాదాల కోసం...

- టేబుల్ స్పూన్ శనగపిండిలో చిటికెడు పసుపు వేసి అందులో తగిన మోతాదులో పాలు లేదా పెరుగు వేసి మరీ గట్టిగా కాకుండా ఒకింత జారుడుగా కలుపుకోవాలి. ఈ పేస్ట్‌ని చేతులకు, పాదాలకు పట్టించి పదిహేను – ఇరవై నిమిషాల పాటు ఉంచాలి. ఆ తరవాత వేళ్లతో వలయాకారంగా మర్దన చేస్తూ చర్మం నుంచి శనగపిండి ప్యాక్‌ను వదిలించిన తర్వాత చన్నీటితో శుభ్రం చేయాలి. వారానికోసారి ఇలా చేస్తుంటే చేతులు, పాదాల చర్మం మృదువుగా మారుతుంది.
- రెండు స్పూన్‌ల నిమ్మరసం లేదా కమలాపండు రసంలో టీ స్పూన్ తేనె, టీ స్పూన్ గ్లిజరిన్, టీ స్పూన్ పన్నీరు కలిపి ఈ మిశ్రమాన్ని చేతులకు, పాదాలకు పట్టించాలి. ఇది రెగ్యులర్ ప్యాక్. చలికాలంలో రోజూ వేసుకోవచ్చు. ఎండాకాలంలో వారంలో రెండుసార్లు సరిపోతుంది.
- చేతి వేళ్లు, పాదాలు ఆకర్షణీయంగా కనిపించాలంటే... కలబంద గుజ్జులో రెండు చుక్కల బాదం నూనె లేదా గ్లిజరిన్ కలిపి రాత్రి పడుకునే ముందు చేతులకు, పాదాలకు రాసుకోవాలి. అలాగే టీ స్పూన్ టొమాటో రసం, అదే మోతాదులో గ్లిజరిన్, నిమ్మరసం కలిపి రాసినా కూడా మంచి ఫలితం ఉంటుంది.

హోమ్ మేడ్ ఫుట్ స్క్రబ్

- మూడు నిమ్మకాయలు, టేబుల్ స్పూన్ చక్కెర, టీ స్పూన్ బాదం నూనె, పది నుంచి పదిహేను పుదీన ఆకులు తీసుకోవాలి. నిమ్మకాయలను ముక్కలు చేయాలి. పుదీన ఆకులు, నిమ్మకాయ ముక్కలను (తొక్కతో సహా) మిక్సీలో గ్రైండ్ చేయాలి. అందులో చక్కెర, బాదం నూనె కలిపితే పాదాలకు స్క్రబ్ రెడీ. దీనిని పాదాలు, మడమలు, వేళ్ల మధ్య పట్టించి ఆరిన తర్వాత చేత్తో ఐదు నుంచి పది నిమిషాల సేపు వలయాకారంగా మర్దన చేసి గోరువెచ్చటి నీటితో శుభ్రం చేయాలి. ఇది అన్ని కాలాల్లోనూ అవసరమే. వర్షాకాలంలో పాదాలు నాని ఇన్ఫెక్షన్‌లు సోకకుండా ఉండడానికి ఈ స్క్రబ్‌లో చిటికెడు పసుపు కలుపుకోవాలి.

స్క్రబ్ తయారు చేసుకునే సౌకర్యం లేనప్పుడు... అర బకెట్ వేడి నీటిలో అరకప్పు ఉప్పు (కల్లు ఉప్పు), నిమ్మరసం, పుదీన ఆకులు, నాలుగు చుక్కల కొబ్బరి నూనె వేసి ఆ నీటిలో పాదాలను ఉంచాలి. పది హేను నిమిషాల తర్వాత బాత్ బ్రష్ లేదా చిన్న నూలు వస్త్రంతో పాదాలను రుద్ది కడగాలి.



వంటిల్లు

మ్యాంగో ఫీస్ట్

సీజనల్ ఫ్రూట్స్ తింటాం... మరి! సీజనల్ ఐస్‌క్రీమ్ ఎందుకు తినకూడదు? అదే చేత్తో... సీజనల్ కుల్ఫీ... కేక్... కూడా ట్రై చేద్దాం. ఈ మ్యాంగో సీజన్‌లో పుణె వారి మస్తానీ కూడా! ఈ వారం మన 'వంటిల్లు'లో మ్యాంగో ఫీస్ట్ చేద్దాం.



మ్యాంగో ఐస్‌క్రీమ్


కావలసినవి: మామిడి పండ్లు – 3 ; కండెన్స్‌డ్ మిల్క్– 400 మి.లీ; తాజా క్రీమ్ – 3 కప్పులు; వెనిలా ఎసెన్స్– అర టీ స్పూన్.

తయారీ: ● వెడల్పు పాత్రలో క్రీమ్ వేసి బీటర్‌తో చిలకాలి. సమంగా కలిసి మృదువుగా రావాలంటే దాదాపు పదినిమిషాల సేపు చిలకాల్సి ఉంటుంది. చిలికిన తర్వాత ఓ గంటసేపు ఫ్రిజ్‌లో పెట్టాలి. ● మామిడిపండ్లను శుభ్రంగా కడిగి చెక్కు, టెంక వేరు చేసి ముక్కలు చేయాలి. ఆ ముక్కలను జ్యూస్ బ్లెండర్‌లో వేసి గుజ్జు చేయాలి. దాదాపు రెండు కప్పుల గుజ్జు వస్తుంది. అందులోనే కండెన్స్‌డ్ మిల్క్ వేసి మరోసారి బ్లెండ్ చేయాలి. ● క్రీమ్ పాత్రను ఫ్రిజ్‌లో నుంచి తీసి అందులో మామిడి గుజ్జు–కండెన్స్‌డ్ మిల్క్ మిశ్రమాన్ని, వెనిలా ఎసెన్స్ వేసి బీటర్‌తో సమంగా కలిసేవరకు చిలకాలి. ఇందుకు ఎలక్ట్రిక్ బీటర్ ఉంటే మంచిది. అది లేకపోతే బ్లెండర్‌లోనే సమంగా కలిసేటట్లు కొద్ది సేపు బ్లెండ్ చేయాలి. ● ఈ మిశ్రమాన్ని ఒక పాత్రలో వేసి స్పూన్‌తో సమంగా సర్ది పైన అల్యూమినియం ఫాయిల్‌తో కవర్ చేసి అంచులను అతికించి ఆరుగంటల సేపు ఫ్రీజర్‌లో పెట్టాలి. మ్యాంగో ఐస్‌క్రీమ్ రెడీ. ● ఫ్రీజర్‌లో నుంచి తీసిన వెంటనే కప్పులో వేయడానికి సాధ్యం కాదు. గట్టిగా ఉంటుంది. కాబట్టి తినడానికి పదినిమిషాల ముందు ఫ్రీజర్‌లో నుంచి తీసి మామూలు ఉష్ణోగ్రతలో ఉంచాలి. **గమనిక:** ఎవరి ఇష్టాన్ని బట్టి వారు చెర్రీ, నట్స్‌తో అలంకరించుకోవచ్చు.

మ్యాంగో కేక్ (ఎగ్‌లెస్)

కావలసినవి: మామిడి పండు ముక్కలు – 300 గ్రాములు ; కండెన్స్‌డ్ మిల్క్ – 400 ఎం.ఎల్ ; **గోధుమ పిండి**– 300 గ్రా ; **చక్కెర** – 3 లేదా 4 టేబుల్ స్పూన్‌లు (మామిడి ముక్కల తియ్యదనాన్ని బట్టి) ; **బేకింగ్ పౌడర్**– టీ స్పూన్ ; **బేకింగ్ సోడా**– అర టీ స్పూన్ ; **వెనిలా ఎసెన్స్** – టీ స్పూన్ ; **వెన్న**– 2 టేబుల్ స్పూన్‌లు.

తయారీ: ● గోధుమ పిండి, బేకింగ్ పౌడర్, బేకింగ్ సోడాలను కలిపి జల్లించి పక్కన పెట్టాలి. ● మామిడి ముక్కలు, చక్కెర కలిపి బ్లెండర్‌లో మెత్తగా చేస్తే మ్యాంగో ప్యూరీ రెడీ. ● అవెన్‌ను 180 డిగ్రీల సెల్సియస్‌తో ప్రీ హీట్ చేసి సిద్ధంగా ఉంచుకోవాలి. ● ట్రేకి కొద్దిగా వెన్న రాసి సిద్ధం చేసుకోవాలి. ● మిగిలిన వెన్నను పెనంలో వేడి చేసి అందులో కండెన్స్‌డ్ మిల్క్ కలిపి మిశ్రమం మృదువుగా వచ్చే వరకు చిలకాలి. అందులో మ్యాంగో ప్యూరీ, వెనిలా ఎసెన్స్ వేసి బాగా కలిసే వరకు చిలకాలి. ఇప్పుడు ముందుగా జల్లించి సిద్ధంగా ఉంచిన గోధుమ పిండి మిశ్రమాన్ని వేసి సమంగా కలిసే వరకు గరిటెతో కలపాలి. ఇది చపాతీల పిండిలా గట్టిగా ఉండకూడదు. అలాగని దోశెల పిండిలా జారుడుగానూ ఉండరాదు. అవసరాన్ని బట్టి కొద్దిగా పాలు వేసి కలుపుకోవచ్చు. ● ఈ మిశ్రమాన్ని వెన్న రాసిన ట్రేలో పోసి ట్రేని ఒకసారి అటూఇటూ కదిలిస్తే ఒకే మందంలో సమంగా సర్దుకుంటుంది. 180 డిగ్రీల ఉష్ణోగ్రతలో 45 నిమిషాల పాటు బేక్ చేయాలి. టూత్ పిక్‌ను గుచ్చి చూసుకుని తేమ లేకుండా లోపల అంతా బేక్ అయిందీ లేనిదీ చెక్ చేసుకోవాలి. అవసరమైతే మరో పది నిమిషాల సేపు బేక్ చేసుకోవాలి. ● అవెన్ నుంచి తీసిన తర్వాత వెడల్పాటి ప్లేట్‌కి వెన్న రాసి లేదా అల్యూమినియం ఫాయిల్ పరిచి అవెన్ బౌల్‌ని బోర్లించి ముక్కలుగా కట్ చేయాలి.



మ్యాంగో మస్తానీ

కావలసినవి: మామిడి పండు ముక్కలు – అర కేజీ ; **పాలు** – పావు లీటరు (కాచి చల్లార్చాలి) ; **చక్కెర** – 2 లేదా 3 టేబుల్ స్పూన్‌లు (మామిడి తియ్యదనాన్ని బట్టి) ; **పిస్తా** – టేబుల్ స్పూన్ ; **బాదం** – పది (సన్నగా తరగాలి) ; **జీడి పప్పు** – 20 (వేయించుకోవచ్చు లేదా పచ్చిగానే వేసుకోవచ్చు) ; **చెర్రీలు** –5 ; **వెనిల్లా ఐస్ క్రీమ్** – 4 స్కూప్‌లు.

తయారీ: ● రెండు టేబుల్ స్పూన్ల మామిడి ముక్కలను విడిగా తీసుకుని మిగిలిన ముక్కలను జ్యూస్ బ్లెండర్‌లో మెత్తగా గుజ్జు చేసుకోవాలి. అందులో పాలు, చక్కెర వేసి మరోసారి బ్లెండ్ చేయాలి. ● ఈ మిశ్రమాన్ని గ్లాసులో పోసి ఐస్ క్రీమ్ అర స్పూన్ వేయాలి. పైన బాదం, పిస్తా, జీడిపప్పు, చెర్రీలు, ముందుగా తీసి పక్కన ఉంచిన మామిడి ముక్కలను చిన్న ముక్కలుగా తరిగి అలంకరించాలి.

గమనిక: మ్యాంగో మస్తానీ చిక్కగా కావాలంటే మామిడి ముక్కలను ఓ గంట సేపు ఫ్రిజ్‌లో పెట్టి బ్లెండ్ చేసుకోవచ్చు లేదా పాలు, చక్కెర కలిపి బ్లెండ్ చేసిన తర్వాత సర్వ్ చేసే లోపు ఓ గంట సేపు ఫ్రిజ్ లో పెట్టవచ్చు. టైమ్ లేనప్పుడు గ్లాసులో ముప్పావు వంతు మ్యాంగో మస్తానీతో నింపి మూడు ఐస్ క్యూబ్‌లు వేసుకోవచ్చు.



మ్యాంగో కుల్ఫీ

కావలసినవి: మామిడి పండ్లు – 3 (పెద్దవి) ; **వెన్నతీయని పాలు** – 300 ఎం.ఎల్ ; **కండెన్స్‌డ్ మిల్క్** – 200 ఎం.ఎల్ ; **తాజా క్రీమ్**– అర కప్పు ; **యాలకుల పొడి**– అర టీ స్పూన్ ; **కుంకుమ పువ్వు**– పది రేకలు.

తయారీ: ● మామిడి పండ్లను కడిగి చెక్కు, టెంక తొలగించి ముక్కలు చేయాలి. ● పాలను కాచి మీగడ తేలనివ్వకుండా తిరగబోస్తూ వెంటనే చల్లార్చాలి. ● క్రీమ్‌ని విడిగా చిలికి పక్కన పెట్టుకోవాలి. ● పాలు, మామిడి పండు ముక్కలు, కండెన్స్‌డ్ మిల్క్ కలిపి బ్లెండ్ చేయాలి. అందులో యాలకుల పొడి, కుంకుమ పువ్వు, చిలికిన క్రీమ్ వేసి మరోసారి తిప్పాలి. ● ఈ మిశ్రమాన్ని కుల్ఫీ మౌల్డ్‌లలో పోసి, మూత పెట్టి ఫ్రీజర్ పెట్టాలి. ఎనిమిది గంటలకు కుల్ఫీ సెట్ అవుతుంది. ● తినడానికి పది నిమిషాల ముందు ఫ్రీజర్‌లో నుంచి బయటకు తీయాలి. వెంటనే తినాలంటే నీటి ధార కింద కుల్ఫీ మౌల్డ్‌ను ఉంచితే మౌల్డ్ నుంచి కుల్ఫీ విడివడుతుంది. ఒక ప్లేట్‌లోకి తీసుకుని చాకుతో స్లైస్‌లుగా కట్ చేసి సర్వ్ చేయాలి. ఇష్టమైతే కుల్ఫీ స్లైస్‌ల మీద మరికొంత యాలకుల పొడి, కుంకుమ పువ్వు చల్లుకోవచ్చు.



హెల్దీ టాయ్స్

ఆటలు ఆడు కన్నా

చీప్ ప్లాస్టిక్. చైనా ప్లాస్టిక్. ఇవాళ పిల్లల బొమ్మలు వీటితోనే దొరుకుతున్నాయి. కళాత్మకమైన దేశీయమైన చెక్కతో తయారైన బొమ్మలు పిల్లలకు ఉండాలి అని బొమ్మల కేంద్రం ప్రారంభించింది మీతా శర్మ. హార్వర్డ్‌లో చదువుకున్నా తన ఇద్దరు పిల్లలు ఆడుతున్న బొమ్మలను చూశాక ఆమె ఈ పని మొదలెట్టింది. ఇవాళ నెలకు వెయ్యి అర్డర్లు వస్తున్నాయి. 100 మంది బొమ్మల కళాకారులు ఉపాధి పొందుతున్నారు. పిల్లలు ఆమె బొమ్మలతో చక్కగా ఆడుకుంటున్నారు.

ఈసప్ కథల్లో 'కాకి దప్పిక' కథ పిల్లలందరికీ చెబుతారు. దప్పికగొన్న కాకి కుండలో నీళ్లను తాగడానికి ప్రయత్నించి, అవి అందకపోతే నాలుగు రాళ్లు జారవిడిచి, నీళ్లు పైకి తేలాక తాగుతుంది. ఆ విధంగా ఆ కథ అవసరం అయినప్పుడు యుక్తిని ఎలా పాటించాలో పిల్లలకు చెబుతుంది. ఈ కథ యూట్యూబ్‌లో వీడియోగా సులభంగా దొరుకుతుంది. కాని మీతా శర్మ తయారు చేసే బొమ్మల్లో ఇదే కథ మొత్తం బుజ్జి బుజ్జి చెక్క బొమ్మల సెట్టుగా దొరుకుతుంది. పిల్లలను ఉద్రేక పరిచే ఆటబొమ్మల కంటే ఇలాంటి బొమ్మలే అవసరం అంటుంది 'షుమి' అనే బొమ్మల సంస్థను సక్సెస్‌ఫుల్‌గా నిర్వహిస్తున్న మీతా శర్మ.



మీతా శర్మ

కంప్యూటర్ ఇంజనీర్

మీతా శర్మది ఢిల్లీ. అక్కడే ఐఐటీ లో బిటెక్ చేసింది. ఆ తర్వాత హార్వర్డ్ యూనివర్సిటీలో పీహెచ్‌డీ చేసింది. వివాహం అయ్యాక అమెరికాలోనే జీవితం మొదలెట్టింది. 'మా పెద్దాడు పుట్టాక అమెరికాలో క్వాలిటీ బొమ్మలు కొనిచ్చాను ఆడుకోవడానికి. అవన్నీ ఎకో ఫ్రెండ్లీ కొయ్యబొమ్మలు. పాడు కావు. హాని చేయవు. 2012 లో అమెరికా వద్దనుకుని ఇండియా వచ్చాక నాకు సమస్య ఎదురైంది. అప్పటికి నా రెండో కొడుక్కి రెండేళ్లు. ఇక్కడ వాడికి ఇద్దామంటే మంచి బొమ్మలే లేవు. అన్నీ ప్లాస్టిక్‌వి లేదా గాడ్జెట్స్, అమెరికన్ కామిక్స్‌లో ఉన్న కేరెక్టర్... ఇవే ఉన్నాయి. ఆ ప్లాస్టిక్ పిల్లలు నోటిలో పెట్టుకుంటే ప్రమాదం. మన చిన్నప్పుడు చెక్కతో తయారు చేసిన బుజ్జి బుజ్జి బొమ్మలు ఎంతో బాగుండేవి. అలాంటి బొమ్మల కోసం ఎంత వెతికినా దొరకడం లేదు. కొన్నిచోట్ల సంప్రదాయ బొమ్మలు ఉన్నాయి కాని వాటి మార్కెటింగ్ సరిగా లేదు. అందుకని నాకే ఒక బొమ్మల తయారీ సంస్థ ఎందుకు మొదలెట్టకూడదు అనిపించింది. 2016లో షుమి సంస్థను స్థాపించాను' అని తెలిపింది మీతా శర్మ.

వేప, మామిడి కలపతో

'నిజానికి సంస్థ స్థాపించడానికి పెట్టుబడి దొరకలేదు. ఎందుకంటే ఆ రోజుల్లో అందరూ పిల్లల గేమ్స్ తయారు చేసే సంస్థలనే ప్రోత్సహించేవి. నా దారేమో సంప్రదాయ కలప బొమ్మల దారి. అందుకే సొంత పెట్టుబడితో సంస్థను స్థాపించాను. బొమ్మలు చేసే కళాకారులను సంప్రదించి కేవలం వేప, మామిడి కలపతో ముద్దొచ్చే బొమ్మలను ముఖ్యంగా రెండేళ్ల వయసున్న పిల్లల కోసం ఎక్కువ గా ఆ తర్వాత పదేళ్ల లోపున్న పిల్లలకోసం బొమ్మలను తయారు చేయించాను. వాటికి ఉపయోగించే రంగులు కూడా రసాయనాలు లేనివే' అంది మీతా శర్మ.

ఢిల్లీలో తన సంస్థను స్థాపించాక రకరకాల కొయ్యగుర్రాలను, మూడు చక్రాల తోపుడు బండ్లను, బుజ్జి గుడారాలను, పిల్లలు ఆడే వంట సామగ్రిని, వారికి కొద్దిపాటి లెక్కలు నేర్పే ఆట వస్తువులను, కథలను బొమ్మల్లో చెప్పే సెట్లను ఇలా తయారు చేయించింది. 'ఆన్‌లైన్‌లో మాకు ఆర్డర్లు వచ్చేవి. చాలామంది తల్లులు ఆ బొమ్మలతో ఐడెంటిఫై అయ్యారు. ఎందుకంటే వారంతా బాల్యంలో అలాంటి బొమ్మలతోనే ఆడారు కనుక. తమ పిల్లలకు సరిగ్గా అలాంటివే దొరకడంతో వారి ఆనందానికి హద్దులు లేవు' అని చెప్పిందామె.



ఇప్పుడు మీతా తయారు చేయిస్తున్న బొమ్మలు అమెరికా, యు.కె, సింగపూర్‌కు కూడా రవాణా అవుతున్నాయి. నెలలో 8000 ఆన్లైన్ ఆర్డర్లు వస్తున్నాయి. 100 మంది కళాకారులు చేతి నిండా పనితో ఉపాధి పొందుతున్నారు.

ఆటే పరిశోధన

'పిల్లల అసలైన పరిశోధన వారు ఆడే ఆటలతోనే మొదలవుతుందని పిల్లల మనస్తత్వ నిపుణులు తెలుపుతారు. పిల్లల్ని పిల్లల్లా ఉంచే ఆటబొమ్మలతో వారిని ఆడనివ్వాలి. హింసాత్మకమైన బొమ్మల నుంచి వారిని దూరం పెట్టాలి. హింసను ప్రేరేపించే గేమ్స్ నుంచి కూడా. పిల్లలు బొమ్మలతో స్నేహం చేసి వాటిని పక్కన పెట్టుకుని భయం లేకుండా నిద్రపోతారు. వారికి బాల్యం నుంచి అలాంటి నిశ్చింతనిచ్చే బొమ్మల వైపుకు నడిపించాలి' అని సలహా ఇస్తోంది మీతా.

ఒక ఉద్యోగిగా కంటే తల్లిగా ప్రయోజనాత్మక అంట్రప్రెన్యూర్‌గా ఆమె ఎక్కువ సంతృప్తిని, గౌరవాన్ని, ఆదాయాన్ని పొందుతోంది. అదీ విజయమేగా.